# హారం — హారం

శ్రీ రామచంద్రుని పట్టాభిషేక మహోత్సవ సమయంలో ఆకాశంలో దేవదుంధుభులు ఒక్కసారిగా ఘోరుమని మారుమోగాయి. అప్సరల నృత్యాల వెలుగులే మెరుపులై నలు వైపుల తళతళ లాడాయి. ఆ సమయంలో అయోధ్యా నగర పౌరులెల్లరు తమ తమ మందిరాలన్నీ పతాకాలతో, రంగు రంగుల రంగవల్లికలతో అలంకరించు కున్నారు.

ఆ పట్టాభిషేకానికి వానర ప్రముఖులు నలుగురు నాలుగు సముద్రాల నుండి స్వచ్ఛ జలం స్వర్ణ కలశాలతో కొని వచ్చి వసిష్ఠ మహర్షి కందించారు. ఆ ముని ఆ పునీత వారిధారలతో కౌసల్యా నంద వర్ధనునికి యథావిధిగా పట్టాభిషేకం కొనసాగించాడు. రత్నసింహాసనం మీద వేంచేసిన ఆ ధర్మమూర్తి శిరస్సు ఇంద్రధనుస్సువంటి మాణిక్య కిరీటంతో అలంకరించాడు.

ఆ మంగళ ముహూర్తంలో శత్రుఘ్నుడు రథంత వెనక భాగంలో నిలిచి, తెల్ల గొడుగు ఎత్తి పట్టుకున్నాడు. సుగ్రీవుడు, విభీషణుడు ఆ దాశరధికి ఇరు వైపుల వింజామరలు అల్లనల్లన కదిలించారు.

ఆ మహోత్సవ సమయంలో అయోధ్యలోనేకాక, కోసల దేశంలో గల తరులతలన్నీ క్రొంగ్రొత్తగా పూచిన పూల గుత్తులతో గుబాళించాయి. మిగుల ముగ్గినపళ్ళ బరువులతో ఒరగా ఒరిగిన ఫల వృక్షాలతో, పాడి పంటలతో, పిల్లలతో, పాపలతో ఆనందిస్తున్న జనానీకంతో నేల నాలుగు వైపుల కలకలలాడింది.

ఆ సంతోష సమయంలో శ్రీరాముడు మూడు వరుల కోటుల సువర్ణ నాణాల బహూకృతులతో దాన ధర్మాలతో పౌరులకేకాక జానపదుల కందరికీ మహోల్లాసం కలిగించాడు. అంతేకాదు. లక్షల కొలది పాడి ఆవులతోబాటు వృషభాలు, ఉత్తమాశ్వాలు, మత్తేభాలు మొదలయిన వానిని అన్ని విధాలా అర్హులయిన ఉత్తమ వేద వేదాంగ వేత్తల కర్పించి, వారి మంగళాశీర్వాదాలందు కున్నాడు.

ఆ సమయంలో ఆ దేవేంద్రుని అనతి ప్రకారం వాయు దైవతమే వచ్చేసి నవరత్నాల కాంతులతో కనుదోయిని మిరుమిట్లు కలిగిస్తున్న ముత్యాల హార మొకటి అదృశ్య హస్తాలతో ఆ నెరదాత గళ సీమలో అలంకరించాడు. ఆ అపూర్వ గౌరవం గమనించిన గంధర్వులు, అప్సరలు ఆనందావేశంతో గగనాంగణంలో నృత్యాలారంభించారు.

ఆ సమయంలో శ్రీరాముని ఆదర పూర్ణదృష్టి సుగ్రీవుని వైపు తిరిగింది. అపార వానర సైన్యంతో అయోధ్యలో విడిసిన నెచ్చెలి ఆ కిష్కింధాధిపతికి ఆ మైత్రీ మాధుర్యనిధి దాశరథి విచిత్ర రత్నాలతో తళతళిస్తున్న గళ మాలిక మిక్కిలి ఆదరంతో బహూకరించాడు. ఆ పైన వైఢూర్యాలతో చంద్ర కిరణాల పుంజాల వలె ప్రకాశిస్తున్న బంగారు బాహుపురులు రెండు చేత బట్టి తానే, వాలి కుమారుడు అంగదుని బాహువుల కలంకరించాడు.

జానకీపతి ఆ విధంగా గౌరవిస్తున్న తరుణంలో ఆ విశాల సభాంగణంలో సమాసీనులయిన సదస్య శ్రేష్ఠులు ఆ పురస్కారా లందుకున్న వారినే కాక ఆ జానకీ జానిని కూడా నాటి నాటికి వినుతించి అభినందించారు.

అదే తరుణంలో దాశరథి అమూల్య రత్నాలు పొదిగిన మేలిమి ముత్యాల హార మొకటి చేత బట్టి సభాసదుల

పి. గణపతిశాస్త్రి

ఆనంద కోలాహలంలో జానకీదేవికి గళ మాలికగా అలంకరించాడు.

అయితే ఆ కోలాహలం ముగియక మునుపే, ఆ వైదేహి సరి కొత్త పట్టు పీతాంబరాల జంటతోబాటు బంగారు హారము, పైడికుండలాలు, అంగుళీయకాలు ఆదిగా గల సువర్ణాభరణాలు కొన్ని అతిశయించిన గౌరవాభిమానాలతో, శూర శిఖామణి హనుమానునికి బహూకరించినది. ఆ సమయంలో సభాసదుల ఆనంద కోలాహలాలు ఉవ్వెత్తుగా ఉప్పొంగి మిన్నందుకున్నాయి.


మరి కొన్ని క్షణాలలోనే ఆ కిశోరి సిగ్గుగా తన మెడలో వేలాడు తున్న ఒక మౌక్తిక మాలిక నెంచుకొని చేత బట్టి ఆ విశాల సభాంగణంలో వానర వీరుల వైపు, విభీషణాది రాక్షస ప్రముఖుల వైపు, పతిదేవుని వైపు తిరిగి తిరిగి తిలకించినది.

అరవిరిసిన పారిజాతం వంటి చిరు నవ్వుతో, జాజ్వల్యమాన మయిన మౌక్తిక మాలికతో ఆ విధంగా నిలిచిన ఆ కమనీయ మహిళ వైపు చూచి పౌర జానపదులలో ఎందరెందరో ఆ పూర్వ దేవతామూర్తి ఎవ్వరో ఆ విధంగా తమ సమక్షంలో సాక్షాత్కరించినదని భావించుకుని అంతర్యాలలో చేతులు జోడించి నమస్కరించారు. ఆ నాటితో తమ జీవితం ధన్యమయినదని భావించుకుని పులకరించారు.

'ఎన్నెన్ని విధాల ఎడతెగని యాతన లనుభవించినా, మల్లె మొగ్గ వంటి ఆ సాధ్వీ తిలకం చిరునవ్వు ఆమెను వీడనాడలేదే? ఆహా! ఏమి ఆ దివ్య మహిత సౌందర్య వైభవము!' అని తలపోసి రెప్పపాటులేని నేత్రాలతో మరి కొందరు కేవలము శిలా ప్రతిమల వలె నిశ్చేష్టితు లయినారు.

అంతలోనే జానకిని గాంచుచుండి మంద్ర మధుర స్వరమున హితోపదేశం మనోహర గంభీరమై వెలువడింది.

"మహారాణీ! కల్యాణీ! తేజస్సులో, ధైర్యంలో, దక్షతలో, కీర్తిలో, నీతిలో,



వినయంలో, పౌరుషంలో, పరాక్రమంలో అపూర్వ బుద్ధి నైపుణ్యంలో సాటిలేని మేటి అని నీవు స్వయాన పొగడిన ధన్యమూర్తిని ఈ మౌక్తిక హారంతో గౌరవింతువు గాక!"

ఆ హితోక్తి విని, 'పెద్దలు ఉభయులు ఇంతకు మునుపు గౌరవించిన వారి కన్న మరి గౌరవార్హులు లెవ్వ రున్నారు? ఇంకెవ్వ రున్నారు?' అని సభాస్తారులు సమ్మానం నాటి నాటికి వితర్కించుకున్నారు. 'అటువంటి సర్వోత్తమ ధన్యమూర్తి ఎవ్వరో కదా!' అని తమలో తాము అనేక విధాల ఆలోచన లారంభించారు.

'ఆహా! ఆ విభీషణుడు తన అన్న దుష్కృత్యాలన్నీ అసహ్యించుకుని ఎన్నెన్ని ఆపద లెదురు పడినా అన్ని విధాలా న్యాయమార్గమే అనుసరించిన అఖండ ధైర్యశాలి. అతని కన్న ఆ హార గౌరవాని కింక అర్హు లెవ్వరున్నారు?' అని తమలో తాము తీర్మానించుకున్నారు.

అయితే, మరి కొందరు ఆ విభీషణుని సాటిగా తలపెట్టలేదు. అటువంటి అపూర్వ పురస్కారానికి ఆ సభాస్థలిలో భరతుడొక్కడే తక్క వేరెవ్వరు తగిన వారు లేరని దృఢంగా నిశ్చయించు కున్నారు. 'కన్న తల్లి కైకేయి మమకారంతోబాటు, కోసల రాజ్య వైభవమే తృణప్రాయంగా పరిగణించి శ్రీరామ చంద్రుని పాదుకలే శిరోభూషణాలుగా ధరించిన భక్తాగ్రణి ఆ భరతుడు! అతనినే తప్పక ఆ హార బహూకారం వరించవలసి ఉన్నది!' అని తమలో తాము దృఢంగా నిర్ణయించుకున్నారు.

కాని మరి కొంత మంది సభాస్తారులు వేరొక విధంగా ఆలోచించుకున్నారు.

'అయ్యో! ఆ సౌమిత్రి కన్న అంతటి అపూర్వ గౌరవాని కింక అర్హు లెవ్వ రున్నారు? ఊర్మిళా లక్ష్మణు లిద్దరు ఒండొరుల ఎడబాటుల వేదనలు నిట్టూర్పు లయినా వెలువరించకుండా నీరవ మౌనాలతోనే సహించారు! వారి వియోగ వ్యథలతో పరిపోల్చినప్పుడు అరణ్యంలో తోడునీడలయి కలిసి మెలిసి మనులుకున్న సీతారాముల వియోగ వ్యథ లెంతటివి? ఊర్మిళాదేవి విరహ మౌన వేదనతో పరిపోల్చినప్పుడు ఆ సీతాదేవి మానసిక వ్యథ ఎంతటిది? ఎన్నెన్ని ఇక్కట్లు లెదురుపడినా అన్న అడుగు జాడలే దిక్కని నమ్ముకున్న ఆ లక్ష్మణ దేవరకన్న ఇంతటి మహనీయ గౌరవాని కింక అర్హు లెవ్వ రున్నారు?'

మరు నిమేషంలోనే ఆ మౌక్తిక హారిక ఎవ్వరి కంఠసీమ చేరునని వారందరు ఏకాగ్రచిత్తంగా నిరీక్షించు కున్నారు. ఆ గౌరవం కోసం నిమిషమొక యుగంగా నిరీక్షించారు.

కాని, అదే క్షణంలో జానకీదేవి దృష్టి హనుమంతుని మీదికి తిరిగినది. ఆ పరాక్రమశాలి ఆ దేవి ఆదరం గమనించి శిరస్సు వంచుకుని నిక్కపు టడుగులతో సమీపించాడు. సీతాదేవి అనుగ్రహించిన ఆ మౌక్తిక హారిక స్వీకరించి, ప్రగాఢ భక్తితో కళ్ళ కద్దుకుని గళసీమలో అలంకరించుకున్నాడు. ఆ విధంగా రెండవ మారుతే కాక, మునిపుంగవులు గౌరవాని కంతటా అతడే అర్హుడని ఆనందించిన సదస్సు అందరు హనుమానునితోబాటు ఆ సకల ... అనేక విధాల వినుతించారు. వారి జయజయధ్వాన నినాదంతో భూనభోంతరాళమే భోరుమని ప్రతిధ్వనించి నది!

అయినా, హనుమ ఆ మౌక్తిక హారిక నిక్కృతి బాగరాగాలతో పరికించి, 'అయ్యో! సీతారాముల పాద పద్మాల ఎడల భక్తితో పరిపోల్చినప్పుడు ఇది ఎందుకు కొరగానిదే!' అని నవ్వు కున్నాడు. కాని, ఒక రాజ నందిని ఆ పల్లవి తల్లి అనుగ్రహించిన బహుమాన మని భావించుకుని వెల్లి విరిసిన బాష్ప జలితో కనుదోయి కట్టుకుని నిలువునా పులకించి ఆనందించాడు! *

